# అపరాజిత

—జొన్నకూటి ప్రశాంతకుమారి

"కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే!...." ప్రాతః కాల సమయాన రేడియోలోనుంచి శ్రావ్యంగా వినిపిస్తున్న ఆ గొంతు యొక్క ధ్వని 'తరంగాల రూపంలో' ప్రయాణించి, లోపల గదిలో డబుల్‌కాట్‌పై పవళించిన 'శృతి' చెవినిసోకినా... మంచం దిగడానికి బద్ధకించి అలాగే పడుకుంది.

ఈలోపు అటుగా వచ్చిన శృతి తల్లి జానకి గడియారం వైపోసారి చూసి "అమ్మో...! అప్పుడే ఏడుకావొస్తుంది" మనసులో అనుకుని కూతురి గదిలోకి పరుగెత్తి "శృతీ! శృతీ! ఏడయ్యింది. లేచి తయారవ్వవే..."! అంటూ గట్టిగా కుదిపింది.


"ఏడు" అన్నమాట వినగానే ఠక్కున లేచి అంతే వేగంగా బాత్‌రూమ్‌లో దూరి, కూనిరాగాలు తీస్తూ... స్నానం ముగించి, తనకెంతో ఇష్టమైన లేత నీలిరంగులో ఉన్న కాటన్‌శారీని కట్టుకుని తల్లి చెంతకు చేరి ఆమె ఆశీర్వాదం తీసుకుని బయటపడింది.

అలా వెళ్తున్న కూతుర్ని కళ్ళనిండుగా చూసుకుంటూ... తనకి తెలియకుండానే కన్నీరు కార్చింది జానకమ్మ. ఆమె మనసేమో గతంలోకి పరుగుతీసింది.

"ఏవోయ్ జానకీ! మనకి ఆడపిల్లపుడితే ఏపేరు పెడదాం?" భర్త రామం మాటలకి సిగ్గుపడ్డ జానకి "మీ ఇష్టం" అనేసింది.

భర్త రామం ఆ మాటలంటున్నప్పుడు పైనున్న దేవతలు తథాస్తు అన్నారు కాబోలు... చాలా ఆలస్యంగానైనా ఆడపిల్లే పుట్టింది. దాంతో ఆ అమ్మాయికి 'శృతి' అని నామకరణంచేసి అల్లారుముద్దుగా పెంచు కోసాగారా దంపతులు.

శృతి పదవతరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైనప్పుడు ఆ వీధిలో ఉన్నవారికి స్వీట్సు పంచారు వాళ్ళు.




ఆ తర్వాత శృతిని కాలేజీలో చేర్చారు. అప్పుడే విచ్చిన పూమొగ్గలా చెంపకి చారడేసి కన్నులతో, గులాబిరంగు పెదవులతో, నడుంమీద నల్లటి త్రాచులా నాట్యమాడే జడతో, తెలుగింటి ఆడపడుచులా పరికిణీ, ఓణీతో తలవంచుకుని కాలేజీకి వచ్చే 'శృతి' అంటే అక్కడ చదివే అందరికీ చాలా ఇష్టం. ఆ అమ్మాయి మంచితనం, సాధుస్వభావం వల్ల ఎవరూ కామెంట్ కూడా చేసేవారు కాదు.

అలా చదువుకుంటున్న 'శృతి' జీవితం మధుకర్ రాకతో పెద్ద మలుపే తిరిగింది.

మధుకర్ అమెరికాలో ఇంజనీరుగా స్థిరపడ్డాడు. అనుకోకుండా ఇండియా వచ్చిన అతను తన అత్తయ్య వాళ్ళింట్లో శృతిని చూసి మనసు పారేసుకుని "నేను పెళ్ళంటూ చేసుకుంటే ఈ అమ్మాయినే చేసుకుంటాను" అని భీష్మించుకూర్చుని చివరికి తన పంతాన్ని నెగ్గించుకున్నాడు.

అమెరికా ప్రయాణానికి సిద్ధపడుతున్న శృతిని చూసి ఎంత అదృష్టవంతురాలో అని అందరూ పొగిడారు.

కట్నాన్ని ఆశించకుండా తమ కుమార్తెని పెళ్ళి చేసుకున్న 'మధుకర్' అంటే శృతి తల్లిదండ్రులకి బోల్డంత అభిమానం. అందుకే శృతి చదువు మధ్యలోనే కుంటుపడ్డా బాధపడలేదు వాళ్ళు. 'తమ అమ్మాయి తమకు దూరంగా ఉన్నా ఎక్కడున్నా సుఖంగా ఉంటే అంతే చాలు' అనుకుని మనసుని సమాధానపరచుకున్నారు.

* * *

చూస్తుండగానే సంవత్సరం గిర్రున తిరిగి పోయింది. శృతి తల్లికాబోతుందన్న వార్త ఆ వృద్ధ దంపతులని అమితానందానికి గురి చేసింది. నెలలు నిండితే రావడం కష్టం అనుకుని ముందే ఇండియాకి వచ్చేసిన శృతి, నెలలు నిండిన తర్వాత పండంటి బాబుకి జన్మనిచ్చి ఇటు తల్లిదండ్రుల్ని, అటు అత్తమామల్ని ఆనందడోలికల్లో ఊగిపోయేలా చేసింది.

కొడుకు పుట్టాడన్న సంతోషంతో ఇండియాకి వచ్చిన మధుకర్ దురదృష్టవశాత్తు హైజాకర్ల చేతికి చిక్కి మరణించాడు.



## టబూ ప్రేమ!

"రాణి చాలా మంచి అమ్మాయి. నటిగా అపుడే ఓ రేంజ్‌కి రాలేదు గాని మనిషిగా ఆప్యాయతా, ప్రేమ కలబోసిన నిండుకుండ" అంటూ అభివర్ణించింది టబూ. ఇంతకీ రాణి మీద అమాంతంగా ఎందుకంత ప్రేమ పుట్టుకొచ్చినట్లు? రాణి ఆఫర్లు కొన్ని డైవర్ట్ చేసుకోవడానికి ఇదో మార్గం అంటున్నారు అనుభవజ్ఞులంతా.

ఆ ఇరుకుటుంబాలకీ అదో పెద్ద షాక్. జరుగవలసిన కార్యక్రమాలన్నీ శృతి ప్రమేయం లేకుండానే జరిగిపోయాయి.

కూతుర్ని ఆ స్థితిలో చూసిన రామంగారు హై.బీ.పీ తెచ్చుకుని కన్నుమూశారు. దాంతో జానకి, శృతి, అప్పుడే పుట్టిన పసికందు ఒంటరివారై పోయారు.

మగదిక్కులేనివారిని తమ ఇళ్ళకు తీసుకువెళ్ళాలని ఉబలాటపడ్డారు శృతికి అయినవాళ్ళు మరియు కానివాళ్ళు.

అది తమ మీద ప్రేమకొద్దీకాదు. తమని వాళ్ళఇళ్ళలో పని మనుషులుగా తయారుచేయడానికేనని వాళ్ళ మాటల ద్వారా గ్రహించిన శృతి ఎవరింటికీ వెళ్ళడానికి ఒప్పుకోలేదు. దాంతో మూతుల్ని ముప్పయ్‌మూడు వంకర్లు తిప్పుకున్న బంధువర్గం ఎవరి దోవనవారు వెళ్ళిపోయారు.

సరిగ్గా... ఆ సమయంలో 'శృతి' మదిలో తళుక్కున మెరిసిందో ప్రశ్న. అదే... జీవితాన్ని ఎలా కొనసాగించాలా... అని.

తనకా చదువు అంతంతమాత్రమే. తన భర్త రెండేళ్లు అమెరికాలో ఉద్యోగం చేసినా... కూడబెట్టింది అంతంతమాత్రమే. అటు అత్తమామలు కూడా ఉన్నవాళ్ళుకాదు. ఏదో తమకున్నంతలో బిడ్డల్ని చదివిస్తున్నారు. తను అక్కడికి వెళ్ళి వాళ్ళకి భారం కాకూడదు. ఎలాగబ్బా! ఆలోచించింది శృతి.

మనిషి జీవితంలో ఎన్నో ఒడిదుడుగులు వస్తుంటాయి. ఎవరో.... అదృష్టవంతులకి జీవితం మాత్రం సాఫీగా గడిచిపోతుంది. అయినా జీవితాన్ని మనం శాసించాలిగానీ... జీవితం మనల్ని శాసించకూడదు. కాబట్టి తనే ఓ నిర్ణయాన్ని తీసుకోవాలి. అది తనకు భవిష్యత్తులో ప్రయోజనకరంగా ఉండాలి. ఏమీ చేతకానివారే కష్టాలకి దాసోహం అంటూ జీవితాన్ని చేజార్చుకుంటారు. తాను అలాకాకూడదు. 'ఎలా రాసిపెట్టుంటే అలాగే జరుగుతుందని' మనసుకు సరిపెట్టుకుని ముందున్న జీవితాన్ని నాశనం చేసుకోకూడదు. నావంతు ప్రయత్నంగా మనసుకి నచ్చిన చిన్నదో.... పెద్దదో ఉద్యోగంలో చేరతాననుకుని అలాగే చేసింది.

అక్కడ ఎంతోమంది మగాళ్ళు తమ చూపులతో, చేష్టలతో, ప్రవర్తనతో 'శృతి'కి దగ్గరవ్వాలని ప్రయత్నించారు. తాను ఏమాత్రం చనువు చూపించినా మగాడి కోర్కెలకు 'గ్రీన్ సిగ్నల్' ఇచ్చినట్లే అని భావించిన 'శృతి' అందుకేమాత్రం అవకాశం ఇవ్వకుండా బలీయమైన తన కోర్కెలకు 'కళ్ళెంవేసి' మధుకర్ జ్ఞాపకాలను మదిలో తలచుకుంటూ తన బాబు బంగారు భవిష్యత్తుకోసం అహర్నిశలు పాటుపడుతూ ఒకవైపు ఉద్యోగం చేస్తూనే.... తిరిగి తన చదువును మొదలెట్టింది.

ఆవిధంగా అటు చదువులో జయాలను చవిచూస్తూ, ఇటు ఉద్యోగంలోనూ అంచలంచెలుగా ఎదుగుతూ ఒకవైపు అత్త మామల కుటుంబాన్ని, మరోవైపు తల్లిని ఆదుకుంటూ వారికి ఆలంబనగా నిలిచింది.

మధ్యలో పెళ్ళి చేసుకునే అవకాశాలు వచ్చినా, ఏ మగాడికీ పరాయిబిడ్డని తన బిడ్డగా ప్రేమించి, దగ్గరకు తీసుకునే తత్వం ఉండదని అనుకున్న శృతి అందుకు తావివ్వకుండా, తన బిడ్డలో మధుకర్‌ని చూసుకుంటూ, తల్లీ తండ్రీ అన్నీ తానై వాడిని కంటికి రెప్పలా చూసుకోసాగింది.

* * *

తన తెలివితేటలతో కంపెనీ ప్రోడక్ట్స్‌ని వృద్ధి చేస్తూ, తాను పని చేస్తున్న సంస్థకే 'ఎమ్.డి' అయింది. తర్వాత మరుదుల పెళ్ళిళ్ళు, ఉన్న ఒక్కగానొక్క ఆడపడుచు పెళ్ళి చేసి వారందరి మనసుల్లో ఉన్నతమైన స్థానాన్ని పొందింది.

అలా జీవితంలో ఎదురయిన ప్రలోభాలకు లొంగకుండా, భవిష్యత్తుని తనకు నచ్చినవిధంగా మలచుకుని, ఎక్కడా ఏవిధంగా భంగపడకుండా, ఎప్పటికప్పుడు సరియైన నిర్ణయాలను తీసుకుంటూ, ఆచీ-తూచీ అడుగువేస్తూ, రాత్రింబవళ్ళు కష్టపడుతూ పరాజయాలకు చోటివ్వకుండా 'అపరాజితగా' నిల్చిన శృతి, నష్టాల్లో నడుస్తున్న ఓ కంపెనీని కొనుక్కోవాలని తల్లి దీవెనలందుకుని వెళ్ళింది.

అదే పనిగా ఆగకుండా మోగుతున్న ఫోను సవ్వడికి ఆలోచనలోనుండి (గతం నుండి) తేరుకున్న జానకమ్మ రిసీవర్ ఎత్తి "హలో!" అంది.

"అమ్మా! నేను శృతిని మాట్లాడుతున్నాను. ఎంతోమంది వ్యాపారవేత్తలు ఆ కంపెనీని సొంతం చేసుకోవాలని పోటీపడ్డా... అదృష్టం మాత్రం మనల్నే వరించింది" అంటూ సంతోషంగా చెప్పింది.

ఆ వార్త విన్న జానకమ్మ హృదయం ఉత్సాహంతో నిండిపోయింది. మరిన్ని విజయాలను సాధిస్తూ నిండు నూరేళ్ళు వర్థిల్లు తల్లీ! అంటూ మనసులోనే దీవించింది జానకమ్మ. ❋

